క్లుప్తంగా

అన్నదానం

కడప కార్పొరేషన్ : సినీనటుడు సుమంత్ బాబు పుట్టిన రోజు సందర్భంగా కడప అక్కినేని ఫ్యామిలీ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్థానిక చౌడమ్మ వృద్ధాశ్రమంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమంత్ బాబు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఇంకా మంచి సినిమాలు తీసి ప్రేక్షకుల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అక్కినేని ఫ్యాన్స్ అధ్యక్షుడు కడప వెంకటయ్య, యూత్ ప్రెసిడెంట్ ప్రేమ్‌నగర్ చందు, ఎస్కే షావలీ, స్వర్ణ నాగార్జున, టి. ఓబులయ్య, వి.హరిబాబు, శివ, జేకే నాగేష్ పాల్గొన్నారు.

కేంద్రం తీరుపై నిరసన



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కడప వైఎస్సార్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించడాన్ని నిరసిస్తూ గురువారం నగరంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలయిన బీఎస్ఎన్ఎల్, పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గిస్తే ఏ విధంగా రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందన్నారు. ఈ రకమైన బడ్జెట్‌ను రాష్ట్రంలోని రైతు సంఘాలు బ్లాక్‌డే పాటించాయన్నారు ఏపీరైతు సంఘం, సీపీఎం నాయకులు ఎంవి సుబ్బారెడ్డి, అన్వేష్, శ్రీనివాసులు రెడ్డి, గోపాల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కాంప్లెక్స్‌కు కంప్యూటర్ ప్రింటర్ వితరణ

వైవీయూ : కడప నగర పరిధిలోని అంగడివీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌కు చిన్నముసల్‌రెడ్డిపల్లెకు చెందిన రాష్ట్ర చేనేత ఐక్యవేదిక కోశాధికారి గునిశెట్టి సాయికుమార్ కంప్యూటర్ ప్రింటర్‌ను వితరణగా అందజేశారు. గురువారం పాఠశాలలో చింతకొమ్మదిన్నె మండల విద్యాశాఖాధికారి ఉండేల వెంకట్రామిరెడ్డి చేతుల మీదుగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి. శ్రీనివాసులుకు అందజేశారు. పేరెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలకు చక్కటి అవకాశం



ప్రొలిఫిక్ 2కే23 లో అధ్యాపకులు, విద్యార్థులు

వైవీయూ : ప్రస్తుత 21వ శతాబ్దం వినూత్న ఆలోచనలు కలిగిన మేధావులు, యువతకు చక్కటి అవకాశాల వేదిక అని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఎస్.ఎస్.మూర్తి తెలిపారు. గురువారం కళాశాలలో ఈసీఈ, ఐయూసీఈఈ స్టూడెంట్స్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రొలిఫిక్ 2కే23 ప్రాజెక్ట్ ఎక్స్ పో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి. హేమలత, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు



మాట్లాడుతున్న టూటౌన్ సీఐ సయ్యద్ హాశం

కడప అర్బన్: జిల్లాలోని స్కూళ్లలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు గురువారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నకాష్‌లోని ఉర్దూ బాలికల హైస్కూల్‌లో సీఐ సయ్యద్ హాసం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పోక్సోయాక్ట్, పిల్లల భద్రత, బాల్యవివాహాల నిరోధం, దిశయాప్, ఈవ్‌టీజింగ్, డయల్-100, రహదారి భద్రత, గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా అండ్ సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

దిశపై అవగాహన అవసరం

కడప అర్బన్: ప్రతి విద్యార్థిని దిశ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని కడప రిమ్స్ పీఎస్ సీఐ కె. రామచంద్ర తెలియజేశారు. గురువారం కడప రిమ్స్ పీఎస్ పరిధిలో మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దిశ యాప్ గురించి, ఉపయోగాల గురించి సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో టోల్‌ఫ్రీ నెంబర్లను తెలియజేసి ఉపయోగించుకోవాలన్నారు. కళాశాల అధ్యాపకులు, రిమ్స్ పీఎస్ ఎస్ఐ నారాయణ పాల్గొన్నారు.

వడివడిగా శ్మశానవాటిక అభివృద్ధి పనులు

- రూ.43లక్షలతో మోడల్ శ్మశాన వాటికగా అభివృద్ధి
- సహకరించిన ఎంపీ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు
- కమిషనర్ ప్రవీణ్‌చంద్, కార్పొరేటర్ల ప్రత్యేక చొరవ



సమాధులతో నిండిపోయిన హిందూ శ్మశానవాటిక(నాడు)



శ్మశానంలో మట్టి తోలి చదును చేసి, మధ్యలో సీసీ రోడ్డు నిర్మించిన దృశ్యం(నేడు)

కడప కార్పొరేషన్ : కడప నగరం అక్కాయపల్లెలో మరియాపురం స్కూల్ వెనుక క్రిస్టియన్, హిందూ శ్మశానవాటికలు పక్కపక్కనే ఉన్నాయి. క్రిస్టియన్ శ్మశానవాటిక ఓ మాదిరిగా ఉన్నా.. హిందూ శ్మశానవాటిక మాత్రం కడు దయనీయ పరిస్థితుల్లో ఉండేది. 40,42,43,44 (కొంతభాగం), 46,47 డివిజన్ల ప్రజలంతా ఇక్కడే మృతదేహాలను పూడ్చుతుంటారు. సుమారు 2.30 ఎకరాలున్న ఈ శ్మశానవాటిక ఎన్నో ఏళ్లనాటి సమాధులతో నిండిపోయి కాలు మోపే దానికి కూడా ఆస్కారం లేకుండా తయారైంది. వర్షాకాలం వస్తే శ్మశానమంతా వర్షపునీటితో నిండి ఉండేది. రెండు అడుగులు గుంత తీస్తే చాలు నీరు ఉబికి వస్తుండటంతో మృతదేహాలను అలాగే వదిలేసి వచ్చే పరిస్థితి.

ప్రజాప్రతినిధుల చొరవతో..

ఎలాగైనా శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని తలంచిన కమిటీ సభ్యులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా అప్పటి కలెక్టర్ హరికిరణ్ ద్వారా డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ నుంచి రూ.18లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో శ్మశానవాటికలోని వర్షపునీటినంతా మోటార్ల సాయంతో బయటికి పంపారు. తర్వాత అందులోని సమాధులను తొలగించడం కమిటీ సభ్యులకు పెద్ద సమస్యగా మారింది.

చాలామంది తమ పూర్వీకుల సమాధులను తొలగించడానికి ససేమిరా అన్నారు. కానీ కమిటీ సభ్యులు ఓపికతో మూడు, నాలుగుసార్లు అందరితో సమావేశమై సమాధులను తొలగించేందుకు అంగీకరింపజేశారు. అన్ని సమాధులను తొలగించాక లోతట్టు ప్రాంతంలో ఉన్న దాన్ని ఎత్తుగా చేయడానికి వెయ్యి టిప్పర్ల మట్టి తోలి చదును చేశారు. ఈ నిధులు చాలకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మరో రూ.25లక్షలు మంజూరు చేయించి ప్రహరీకి మరమ్మతులు చేసి, వర్షపునీరు పోయేందుకు కాలువలు ఏర్పాటు చేశారు. శ్మశానం మధ్యలో 8 అడుగుల సిమెంటు రోడ్డు ఏర్పాటు చేశారు. దానికి ఇరువైపులా మొక్కలు, దీపాలు, హైమస్ లైట్లు, స్వాగతతోరణం, గజిబో, ఆరు అడుగుల పరమశివుని విగ్రహం, వాచ్‌మెన్ గదులు, కొళాయిలు, గేటు, వాటర్ పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. శ్మశానంలో పచ్చదనం పెంచి ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ఇకపై శ్మశానవాటికలో సమాధులు కట్టకుండా ఒక క్రమపద్ధతిలో ప్లాటింగ్ చేసి, నంబర్లు ఇచ్చి ఒకవైపునుంచి పూడ్చుకుంటూ రావాలని నిర్ణయించారు. అడుగుతీసి అడుగు పెట్టడానికి కూడా ఆస్కారం లేని శ్మశానవాటికను అందంగా తీర్చిదిద్దుతుండటంపై స్థానిక ప్రజల్లో హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అందరినీ ఒప్పించడానికి మూడు నెలల సమయం పట్టింది



శ్మశానంలో ఉన్న సమాధులను తొలగించానికి మొదట ఎవరూ ఒప్పుకోలేదు. వేరే ప్రాంతంలో శ్మశానవాటిక ఏర్పాటు చేయడానికి స్థలాలు దొరకలేదు. ఈ విషయాన్ని అందరికీ చెప్పి ఒప్పించడానికి మూడు నెలల సమయం పట్టింది. పిచ్చి మొక్కలతో.. మోకాలిలోతు నీటిలో మునిగిపోయి ఉన్న శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు చాలా ప్రయాస పడాల్సి వచ్చింది.

– చరంత్ అంజి, అధ్యక్షుడు, రుద్రభూమి హిందూ శ్మశానవాటిక, అక్కాయపల్లె

గ్రూప్-2 నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : ఏపీపీఎస్సీ గ్రూప్-2కు సంబంధించి వివిధ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేయలేదని దీంతో రోజు రోజు ఉద్యోగాల ఖాళీ సంఖ్య పెరుగుతూ పరిపాలన కుంటుపడుతోందన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు శివ నాగేంద్ర, దస్తగిరి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వివిధ రంగాల్లో విస్తరిస్తున్న నానోటెక్నాలజీ

వైవీయూ: వివిధ రంగాలకు నానోటెక్నాలజీ విస్తరిస్తోందని నాగ్‌పూర్ విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర ఆచార్యులు డాక్టర్ సంజయ్ దోల్లే పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మెటీరియల్ సైన్స్' అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పూర్వకాలంలో వినియోగిస్తూ వచ్చిన కిరోసిన్ బుడ్డీ నుంచి ప్రస్తుతం వినియోగిస్తున్న ఎలక్ట్రిసిటీ ల్యాంప్ వరకు జరిగిన పరిణామ క్రమాన్ని వివరించారు. అనంతరం భోపాల్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ రేణు ఉపన్యసించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్యనారాయణరెడ్డి సెమినార్ గురించి వివరించారు. కళాశాల డైరెక్టర్ బి. శివవిష్ణుమోహన్ రెడ్డి, సెమినార్ కన్వీనర్ కె. రాజ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర

కడప వైఎస్సార్ సర్కిల్ : కర్ణాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. కర్ణాటకలోని అప్పర్ భద్ర నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గురువారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలలో ఎలా అయినా గెలవాలనే ఉద్దేశంతో రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా అప్పర్ భద్ర మీద కర్ణాటక నిర్మిస్తున్న ప్రాజెక్టును ఆగమేఘాల మీద జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిందన్నారు. 17 డైరెక్టరేట్లు పొందాల్సిన ప్రాజెక్టుకు 17 నెలలో అనుమతి రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల రాయలసీమలోని భూములు బీడుగా మారి ఎడారిగా మారుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పర్ భద్ర నిర్మాణాని అడ్డుకోవడానికి సుప్రీం కోర్టుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు నజీర్ అహ్మద్, శ్రీనివాసులు, మగ్బూల్ బాషా, ప్రతాప్‌రెడ్డి, ఈశ్వరయ్య, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థిక బలోపేతమే జగనన్న లక్ష్యం

కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : పేదల ఆర్థిక బలోపేతమే జగనన్న లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు తెలిపారు. గురువారం మండలంలోని పెద్దకాంపల్లి, కొలుములపల్లి పంచాయతీ పరిధిలోని మద్దిమడుగు, సుగాలిబిడికి, లక్ష్మీనారాయణపురం, వేపమానుసత్రం గ్రామాల్లో వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేస్తున్నారన్నారు. మన సంక్షేమ పథకాలను చూసి దేశంలోని ఇతర రాష్ట్రాలు ప్రవేశ పెట్టేందుకు కృషి చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, సర్పంచ్‌లు మల్లిఖార్జునయాదవ్, రాజశేఖర్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, సుబ్బరాయుడు, ఎంపీటీసీలు నారే నాగరాజు, వెంకటరెడ్డి, నాయకులు రామాంజనేయులు, గూడ రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, గజ్జల ఈశ్వర్‌రెడ్డి, చిన్న సిద్దయ్య, లక్కిరెడ్డి రమణారెడ్డి, కువైట్ బాషా తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రాల అవిష్కరణ

పెండ్లిమర్రి : పొలతల శైవక్షేత్రంలో ఈనెల 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వాన గోడ పత్రాలను గురువారం కడప నగరంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్‌కుమార్‌లు అవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.

వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉప కమిషనర్ కార్మికశాఖ శ్రీకాంత్ నాయక్

కడప కోటిరెడ్డిసర్కిల్: వెట్టిచాకిరీ నిర్మూలనపై వివిధ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమం చేపట్టాలని ఉప కమిషనర్ కార్మిక శాఖ శ్రీకాంత్ నాయక్ తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీఓ నెంబరు 1 ద్వారా వెట్టిచాకిరి నిర్మూలన దినం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ స్వేచ్ఛ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజలందరూ వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు తమవంతు సహకారాన్ని అందించాలని, ఆపరేషన్ స్వేచ్ఛను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. వెట్టిచాకిరి చేయించుకునే యజమానులకు కఠిన చర్యలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లలోపు బాల కార్మికులను పనుల్లో, షాపుల్లో, దుకాణాల్లో పెట్టుకోరాదన్నారు. వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రతి బుధవారం కార్మికశాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. కార్మికశాఖ అధికారులు శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, జాన్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో

వెట్టిచాకిరి నిర్మూలన దినోత్సవ సందర్భంగా కడప నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కేపీ రొనాల్డ్, కార్మిక శాఖ అధికారులు శ్రీనివాసులురెడ్డి, పాల్ జాన్సన్, మునిస్వామి పాల్గొని పోస్టర్లను ఆవిష్కరించారు.

ఉత్సాహభరితంగా ముగ్గుల పోటీ



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో వార్షికోత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలు, పెద్దలకు ధార్మిక క్విజ్‌పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఉదయం జరిగిన ఈ పోటీల్లో పది బృందాలు పాల్గొన్నాయి. క్విజ్ మాస్టర్ కృష్ణారెడ్డి, స్కోరర్ వెంకట సుబ్బయ్య రామాయణ, మహాభారత, భగవతాల నుంచి ఐదు రౌండ్ల ప్రశ్నలు అడిగారు. పోటీ దాదాపు రెండు గంటలపాటు పూర్తి ఆసక్తిగా సాగింది. సరస్వతి, వశిష్ఠ, గౌరీ గ్రూపులు మొదటి మూడు స్థానాలు సాధించాయి.

మురిపించిన ముగ్గులు

సాయంత్రం విభాగంలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. దాదాపు 35 మంది మహిళలు తమ సృజనను రంగురంగుల ముగ్గులతో ఆవిష్కరించారు. రెండు గంటలకు పైగా సాగిన ఈ పోటీలో కనువిందు చేసే పలు ముగ్గులు అలరించాయి. ఎస్. శ్వేత ప్రథమ, జి.మాధవీలత ద్వితీయ, ఎం.అయ్యమ్మ తృతీయస్థానాల్లో నిలిచి రూ.5000, రూ. 3000, రూ. 2000 బహుమతికి ఎంపికయ్యారు. ఈ పోటీకి హేమలత, గౌరీ, కాంతవల్లి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. వీరికి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రధాన వేదికపై జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో బహుమతి ప్రధానం చేయనున్నారు. రాత్రి జరిగిన భక్తి సంగీత పోటీలో 30 మందికిపైగా గాయకులు పోటాపోటీగా తన గాన ప్రతిభను చాటుకున్నారు. ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం మహిళలకు సరదా ఆటలపోటీలు నిర్వహిస్తారు. అనంతరం విద్యార్థులకు ధార్మిక పాత్రల వేషధారణ పోటీ నిర్వహిస్తారు.

విశ్వాసులకు లూర్దుమాత ఆశీస్సులు



లూర్దుమాత గొప్పతనాన్ని వివరిస్తున్న పాదర్ బెన్ని

కడప కల్చరల్: విశ్వాసంతోనే లూర్దుమాత ఆశీస్సులు పొందవచ్చని ఏలూరు జ్ఞాన కేంద్రం డైరెక్టర్ ఫాదర్ బెన్ని అన్నారు. కడప నగరం మరియాపురం పాత చర్చి ఆవరణలో నిర్వహిస్తున్న లూర్దుమాత తిరునాల కార్యక్రమాల్లో భాగంగా 8వ రోజు చర్చి ప్రధాన వేదికపై ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. ఇందులో భాగంగా లక్కిరెడ్డిపల్లె విచారణ గురువు పాదర్ విజయమోహన్‌రెడ్డి దివ్య బలిపూజ నిర్వహించారు. అనంతరం పాదర్ బెన్ని మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ దైవభక్తితోపాటు దైవ భీతి కూడా ఉండాలని, మానవులు ఆత్మను దేవుని మందిరంగా మార్చి హృదయ శుద్ధితో జీవించినపుడు దేవుడు ఆశీర్వదిస్తారని తెలిపారు. తొలుత అలంకరించిన తేరుపై మరియమాత స్వరూపాన్ని నిలిపి మరియాపురం వీధుల్లో భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రధాన వేదిక వద్ద ప్రతిష్ఠించి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మరియాపురం విచారణ గురువు బిరుసు రాజా, సహాయ గురువు పాదర్ కె.చంద్ర, పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ బి.సతీష్, బిషప్ కార్యదర్శి పాదర్ గోవింద్ భూపేష్, బిషప్ హౌస్ ఇన్‌ఛార్జి పాదర్ లూర్దు, తిరునాల కమిటీ అధ్యక్షులు వారాది జోసెఫ్, ఉపాధ్యక్షులు పి.విజయకుమార్, కార్యదర్శి పి.లూర్దు, కోశాధికారి యు.విజయభాస్కర్ పాల్గొన్నారు.

నేడు నగరంలో ఊరేగింపు

లూర్దుమాత తిరునాలలో భాగంగా 9వ రోజు కార్యక్రమాల్లో ప్రధానమైన తేరు ప్రదక్షిణ నిర్వహించనున్నారు. సాయంత్రం నగరంలోని డాన్‌బాస్కో చర్చిలో దివ్య బలిపూజ, ప్రసంగం అనంతరం కారుణ్యమాత సభ గురువుల ఆధ్వర్యంలో లూర్దు మాత స్వరూపాన్ని ప్రత్యేకమైన రథంపై ఊరేగించనున్నారు.

నేడు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన

కడప వైఎస్సార్ సర్కిల్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ శుక్రవారం కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర వెల్లడించారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలు అవుతున్నా రాష్ట్ర విభజన చట్టంలోని హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం కేవలం కార్పొరేట్ సంస్థలకు మేలు చేయడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఈ సమస్యలపై చేస్తున్న నిరసనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రేపు నటుడు సిలార్ సంస్మరణ సభ

కడప కల్చరల్ : సీనియర్ రంగస్థల నటుడు, దర్శకుడు, రచయిత వైఎస్ సిలార్ సంస్మరణ సభను శనివారం సాయంత్రం 6 గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు వైఎస్ సాయిబాబా తెలిపారు. శ్రీ నవ్య కళానికేతన్ నాటక సంస్థను 40 ఏళ్లపాటు దిగ్విజయంగా నడిపించి నాలుగుసార్లు రాష్ట్ర స్థాయి నాటక పరిషత్తులు నిర్వహించి వేలాది నాటకాలను ప్రభుత్వ ప్రచారాలకు ప్రదర్శించిన ఘనత వైఎస్ సిలార్‌ది. ఆయన అనారోగ్యం కారణంగా గత ఏడాది మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన సంస్మరణగా తొలి వర్ధంతి కార్యక్రమాన్ని బ్రౌన్ కేంద్రంలో నిర్వహించనున్నారు. అభిమానులు, శిష్యులు, బంధుమిత్రులు హాజరు కావాలని ఆయన కోరారు.

సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టాలి

వల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2021–22లో జరిగిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టాలని ఎస్ఆర్‌పీ తిరుమలేషు తెలిపారు. గురువారం మండలంలోని వల్లూరు, గోటూరు, కోట్లూరు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై చేపట్టిన 16వ విడత సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టాలన్నారు. మండలంలో రూ.4.08 కోట్లు మేరకు కూలీలకు, రూ.3.54 మేరకు మెటీరియల్‌కు ఖర్చు చేసి ఉన్నారని, ఆ పనులన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడైనా అవినీతి జరిగి ఉంటే నివేదిక సిద్ధం చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈనెల 22వ తేదీ నాటికి సామాజిక తనిఖీ పూర్తి చేయాలన్నారు. 23న జిల్లా అధికారుల సమక్షంలో ఓపెన్ ఫోరం జరుగుతుందన్నారు. 11న తోళ్లగంగన్నపల్లె, 12న పైడికాలువ లేబాక, 13న దిగువపల్లె, 14న దుగ్గాయపల్లె, 15న తప్పెట్ల, 17న అంబవరం, 18న కొప్పోలు, పెద్దపుత్త, 19న కుమారునిపల్లె, 20న ఆదినిమ్మాయపల్లె గ్రామాల్లో సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. ఉపాధి కూలీలు, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు సామాజిక తనిఖీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి కవిత



కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.కవిత తెలిపారు. బ్రాండెడ్ లేబర్ దినోత్సవ సందర్భంగా గురువారం నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని భార్గవ్ కెమికల్స్ ఇండస్ట్రీ, పీవీఎస్ కెమికల్స్ ఇండస్ట్రీలను ఆమె తనిఖీ చేసి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె కార్మికులకు అందుతున్న సదుపాయాలు, వారు పని వేళలు, జీతభత్యాలు, ఇతర సదుపాయాల గురించి తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్ ఆవరణలోని వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్నహస్తం వన్‌స్టాప్ సెంటర్ అని, ఒకేచోట అనేక సేవలు అందుతున్నాయన్నారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు ప్రసాద్, ఇండస్ట్రియల్ యజమానులు, కార్మికులు పాల్గొన్నారు.

పాతబస్టాండు బ్రిడ్జిని సుందరంగా మార్చాలి



మార్నింగ్ విజిట్‌లో భాగంగా రవీంద్రనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : పాతబస్టాండు బ్రిడ్జిపై ఉన్న కుండీలలో మొక్కలు నాటి ఆ మార్గాన్ని సుందరంగా మార్చాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా రవీంద్రనగర్‌లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా దోమల నివారణకు ఫాగింగ్, కాలువల్లో స్ప్రేయింగ్ చేయించాలన్నారు. వ్యాపార దుకాణాల వారు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్లానింగ్ సెక్రటరీలు తమ పరిధిలో నిర్మిస్తున్న గృహాలు తప్పనిసరిగా ప్లాన్ అప్రూవల్స్ కలిగి ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న రోడ్లు, కాలువల్లో నాణ్యతా లోపాలు లేకుండా నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. ఎంహెచ్ఓ ప్రశాంత్‌వర్ధన్, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల కోర్సులపై అధ్యాపకుల ప్రచారం



విద్యార్థులకు కరపత్రాలు అందజేసి ప్రచారం నిర్వహిస్తున్న ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

వైవీయూ : విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కలిగి, స్వయంప్రతిపత్తి కలిగిన ఏకైక డిగ్రీ కళాశాల కడప ప్రభుత్వ పురుషుల కళాశాల అని కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. గురువారం కడప ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు కళాశాలలో లభించే సౌకర్యాలపై ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ప్రవేశాలు పొంది ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఆర్. నీలయ్య, నోడల్ సెంటర్ డైరెక్టర్ డా. పి.హరిప్రసాద్ తదితరులు కళాశాల సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో బి. విజయ్‌కుమార్, శివరాం, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ మాటలు హాస్యాస్పదం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్



కడప కార్పొరేషన్ : సభ్య సమాజం తలదించుకునేలా సంస్కార హీనంగా నారా లోకేశ్ భాష ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనాకు భయపడి హైదరాబాద్‌లో తలదాచుకున్న చంద్రబాబు, నారా లోకేశ్‌లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి భయం అంటే ఏమిటో రుచి చూపిస్తామని సినిమా డైలాగులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. లోకేష్ మాటలు వింటుంటే మాయా బజార్ చిత్రంలో రేలంగి పాత్ర గుర్తుకు వస్తోందని ఎద్దేవా చేశారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని, ఇది చూసి ఓర్వలేక టీడీపీ నీచ రాజకీయాలకు తెరలేపిందన్నారు. టీడీపీ పాలనలో రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. ప్రజల బాగోగులు చూస్తూ అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వంపై విషం కక్కడం దారుణమన్నారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని లోకేష్‌కు, ఒంటి చేత్తో 151 అసెంబ్లీ స్థానాలు, 23 ఎంపీ స్థానాలు గెలిపించిన జగన్‌కు ఎక్కడా పోలిక లేదన్నారు. యువగళంకు జనాలు రాక పోవడంతో లోకేష్ సెల్ఫీలతో కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు.